

దూకుడుగా సినిమాలు చేయడంలో రవితేజ ముందుంటారు. ఆయన తాజా సినిమా 'మిస్టర్ బచ్చన్' చిత్రీకరణ పూర్తి చేసుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. వైట్ సూట్‌లో స్టైలిష్‌గా ఉన్న రవితేజను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తున్నదని, సుబ్రమణ్యం ఫర్ సేల్, గద్దలకొండ గణేష్ సినిమాల తర్వాత హరీశ్‌శంకర్, మిక్కీ జె.మేయర్ కలిసి పనిచేస్తున్న సినిమా ఇదేనని, అందుకు తగ్గట్టే పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయని మేకర్స్ చెబుతున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. ఈచిత్రానికి కెమెరా: అయాంక బోస్, సమర్పణ: పనోరమా స్టూడియోస్ అండ్ టీ సిరీస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

మూడు పాటలు రెడీ?

ఎట్టకేలకు 'గేమ్‌చేంజర్' పని పూర్తి చేసుకొని రామ్‌చరణ్ కాస్త ఫ్రీ అయ్యారు. ఆ సినిమా క్రిస్మస్ కానుకగా విడుదల చేయనున్నట్టు దిల్‌రాజు ప్రకటించారు. ఇక నెక్ట్స్ చేసే 'ఆర్‌సీ 16' కోసం చరణ్ మేకోవర్ అవ్వాల్సివుంది. అందుకే.. రెండు నెలల విరామానం తరం రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టాలని మేకర్స్ భావించారు. ఈ గ్యాప్‌లో దర్శకుడు బుచ్చిబాబు పాటల రికార్డింగ్‌పై దృష్టిపెట్టారు. సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్‌తో ఇప్పటికే ఆయన మూడు పాటలకు ట్యూన్స్ రెడీ చేయించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ ప్రస్తుతం ప్రచారంలో ఉంది. దాదాపు అదే ఖరారయ్యే అవకాశం కూడా ఉందని ఫిల్మ్ వర్గాల టాక్. జాన్వీకపూర్ కథానాయికగా నటించనున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషించనున్నారు. మైత్రీమూవీమేకర్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై ఈ సినిమా రూపొందుతోంది.

వారందరి దీవెనలవల్లే ఇది సాధ్యమైంది

'సరైన సమయంలో సరైన అవకాశాలు వచ్చాయి కాబట్టే ఈ స్థాయిలో ఉన్నా. నా ఎదుగుదలకు కారణం నా దర్శకులే. నా తప్పుల్ని కూడా ఇష్టపడ్డారు.. క్షమించారు.. తీర్చిదిద్దారు. వారి దీవెనల వల్లే ఇది సాధ్యమైంది. దర్శకత్వం అంటే ఇష్టం. అది బాధ్యత కూడా. అందుకే కాస్త భయంగా ఉంది. ఏఆర్ రెహమాన్, ప్రకాశ్‌రాజ్, ఎస్‌జెసూర్య, శరవణన్ ఇంకా నా టెక్నికల్ టీమ్ అందరూ నన్ను నమ్మి పనిచేశారు. కళానిధిమారన్ నన్ను నమ్మి ఖర్చుపెట్టారు. 'రాయన్' మంచి సినిమా. తమిళ ఆడియన్స్ తోపాటు తెలుగువాళ్లకు కూడా నచ్చుతుందని నా నమ్మకం.' అని జాతీయ ఉత్తమనటుడు ధనుష్ అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం 'రాయన్'. కళానిధిమారన్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ని ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్స్ విడుదల చేయనుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడారు. 'ధనుష్ తనకోసం రాసుకున్న పాత్రను నాతో చేయించారు. ఆయన కోసం రాసుకున్న పాత్రను ఆయన దర్శకత్వంలో నేను చేయడం నా కెరీర్‌లో మరిచిపోలేని విషయం. బాధ్యతగా తీసుకొని ఈ పాత్ర చేశా.' అని సందీప్‌కిషన్ తెలిపారు. మనకున్న నటుల్లో ధనుష్ అరుదైన నటుడని ప్రకాశ్‌రాజ్ కొనియాడారు. అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కథానాయికలు అపర్ణ బాలమురళి, దుషారా విజయన్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా కాళిదాస్ జయరామ్, డి.సురేశ్‌బాబు, దిల్‌రాజు, ఏషియన్ సునీల్, గోపీచంద్ మలినేని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సహనమంతా అతనిపైనే



ఫుడ్ పాయిజన్ కారణంగా ఆసుపత్రి పాలైన జాన్వీకపూర్, శనివారం డిస్చార్జ్ అయ్యింది. ప్రస్తుతం ఆమె బాగానే ఉన్నదని ఆమె తండ్రి బోనీకపూర్ తెలిపారు. ఇదిలావుంటే.. ఇటీవల తన ప్రేమ గురించీ, తన ప్రియుడి గురించీ ఆసక్తికరంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది జాన్వీ. 'పీరియడ్స్ టైమ్‌లో నాకు చికాకు ఎక్కువగా ఉండేది. ఆ అసహనం అంతా నా బాయ్‌ఫ్రెండ్ పైనే చూపించేదాన్ని. ఆ టైమ్ వచ్చిందంటే చాలు తనకు బ్రేక్ అప్ చెప్పేసేదాన్ని. తర్వాత నేనే ఏడ్చుకుంటూ వెళ్లి సారీ చెప్పేదాన్ని. మొదట్లో బ్రేక్‌అప్ చెప్పినప్పుడు తను షాక్ అయ్యాడు. తర్వాత నా పరిస్థితి అర్థం చేసుకొని, ఆ టైమ్‌లో నేనేం అన్నా పట్టించుకోవడం మానేశాడు.' అంటూ నవ్వుతూ చెప్పింది జాన్వీ. పెళ్లెప్పుడు చేసుకుంటావ్? అనడిగితే 'ఎప్పుడు చేసుకుంటానో చెప్పలేను. ఎక్కడ చేసుకుంటానో చెప్తా. నా పెళ్లి కచ్చితంగా తిరుమలలోనే జరుగుతుంది. అది మా అమ్మమ్మ పుట్టిన ఊరు. పైగా నా ఇష్టదైవం బాలాజీ. అందుకే.. అక్కడే నా పెళ్లి' అని చెప్పింది జాన్వీ. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్‌కుమార్ షిండే మనవడు శిఖర్ పహాడియాతో జాన్వీకపూర్ రిలేషన్‌లో ఉన్నదని కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ బీటౌన్‌లో కలిసి పార్టీలకు హాజరవ్వడం, పుణ్యక్షేత్రాలకు కలిసి సందర్శించడం వీరి అనుబంధంపై వస్తున్న వార్తల్ని బలపరుస్తున్నాయి. రీసెంట్ గా అనంత్ అంబానీ పెళ్లి వేడుకలోనూ వీరు కలిసే పాల్గొనడం గమనార్హం.

ఆ విధంగా తగ్గానన్నమాట!

'సఖి' టైమ్‌లో మాధవన్ అంటే అమ్మాయిల కలల రాకుమారుడు. కేవలం ప్రేమకథలే కాకుండా, వైవిధ్యమైన కథల్లో నటించి నటుడిగా కూడా తనకంటూ ఓ మార్క్‌ను సృష్టించుకున్నారు మాధవన్. 'నా తర్వాత జనరేషన్‌లో నాకు నచ్చిన నటుడు మాధవన్' అని కమల్‌హాసన్ అంతటి మహా నటుడే కొనియాడంటే నటుడిగా మాధవన్ పొటెన్షియాలిటీ ఏంటో అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది 'రాకెట్రీ' చిత్రంతో అటు దర్శకుడిగా, ఇటు నటుడి విమర్శకుల ప్రశంసలందుకున్నారు మాధవన్. అందులో మాధవన్ పోషించిన నంబి నారాయణ్ పాత్ర జనహృదయాల్లో పదిలంగా నిలిచిపోతుంది. ఆ పాత్రకోసం బరువు పెరగడమే కాక, బొజ్జ కూడా పెంచారు మాధవన్. మళ్లీ ఇప్పుడు ఆయన సన్నగా ఫిట్‌గా కనిపిస్తున్నారు. ఇదిలాసాధ్యం అనడిగితే 'ఇంటర్మీడియట్ ఫాస్టింగ్ పాటించాను. తినేటప్పుడు ఆహారాన్ని 45-60 సార్లు నమిలి తిన్నాను. చివరి మీల్ సాయంత్రం 6.45 నిమిషాలకే ముగించేవాడ్ని. రాత్రి వీలైనంత త్వరగా పడుకోవడం.. కలతనిద్ర లేకుండా పడుకునే గంటన్నర ముందే సెల్‌ఫోన్, టీవీ హాఫ్ చేసేయడం.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం.. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం.. ముఖ్యంగా ఉదయం ఎక్కువ సమయం నడవడం.. ఇవన్నీ 21 రోజులు క్రమం తప్పకుండా చేశాను. అందుకే ఫలితం కనిపిస్తోంది' అన్నారు మాధవన్.

అరుదైన అమ్మాయి కథ

పురుషాధిక్య ప్రపంచాన్ని అధిగమించి తనదైన ముద్ర వేసిన అరుదైన అమ్మాయి కథతో రూపొందిన వెబ్‌సిరీస్ 'బృందా'. టైటిల్‌రోల్ త్రిష పోషించారు. తను నటించిన తొలి వెబ్‌సిరీస్ ఇదే కావడం విశేషం. ఆగస్ట్ 2 నుంచి సోనీ లీవ్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు తమిళ్, కన్నడ , మలయాళం, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లోనూ ఈ సిరీస్‌ని చూడొచ్చు. ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. భావోద్వేగ పూరితంగా, థ్రిల్లర్ అంశాలతోపాటు ఇన్వెస్టిగేషన్‌కి సంబంధించిన సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రవీంద్రవిజయ్, ఆనంద్ సామి, రాకేందుమౌళి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్‌కు కెమెరా: దినేశ్ కె.బాబు, దర్శకత్వం: సూర్య మనోజ్.

యువకుల సంఘర్షణ

నిహారిక కొణిదెల సమర్పణలో రూపొందుతోన్న చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకుడు. పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మాతలు. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్‌వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్ కుమార్ పరిమి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫ్రెండ్‌షిప్‌డే కానుకగా ఆగస్ట్ 9న విడుదల కానుంది. న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేయాలనే తలంపుతో ఎక్కువమంది కొత్తవాళ్లతో తీసిన సినిమా ఇదని, యువతతోపాటు, కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చే సినిమా ఇదని నిహారిక నమ్మకం వ్యక్తం చేశారు. ఇందులో 11మంది హీరోలను, 4గురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నామని, స్నేహం, భావోద్వేగాలు, ప్రేమ, పల్లెటూరి రాజకీయాలు, యువత సంఘర్షణ.. ఈ అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయని దర్శకుడు చెప్పారు. మంచి కంటెంట్ ఉన్న సినిమాను నిర్మించినందుకు ఆనందంగా ఉందని నిర్మాతల్లో ఒకరైన జయలక్ష్మి ఆనందం వెలిబుచ్చారు.

ఇంటిపేరుతో సినిమా తీసేశాం

కంచర్ల ఉపేంద్రబాబు కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'కంచర్ల'. యాద్ కుమార్ దర్శకుడు. కంచర్ల అచ్యుతరావు నిర్మాత. ఈ సినిమా ఆఖరి షెడ్యూల్‌ని అరకులో గల మడగడ వ్యూ పాయింట్ వద్ద పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం వైజాగ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'మా ఇంటిపేరునే టైటిల్‌గా పెట్టి ఈ సినిమా నిర్మిస్తున్నాం. వచ్చే నెలలో సినిమా విడుదల చేస్తాం. వచ్చే లాభాలతో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తాం. కొత్తవారికి అవకాశాలిస్తూ మొత్తం ఎనిమిది సినిమాలు నిర్మిస్తున్నాం. ఆగస్ట్15 తర్వాత సినిమాను విడుదల చేస్తాం. సాంకేతికంగా కూడా సినిమా మరోస్థాయిలో ఉంటుంది' అని తెలిపారు. అద్భుతమైన కథతో, తమ ఇంటిపేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని హీరో ఉపేంద్రబాబు నమ్మకం వ్యక్తంచేశారు. అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు హీరోయిన్ మీనాక్షి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ మధురవాడలో నిర్వహిస్తామని దర్శకుడు తెలిపారు.

అందమైన నవ్వుతో అల్ట్రామోడ్రెన్‌గా

మాస్ యాక్షన్ కామెడీ అంశాలతో కూడిన ట్రైయాంగిల్ లవ్‌స్టోరీ 'మెకానిక్ రాకీ'. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా రూపొందుతోన్న ఈ చిత్రం ద్వారా రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. తాళ్లూరి రామ్ నిర్మాత. ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 31న విడుదల కానుంది. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. హైబజ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అత్యున్నత సాంకేతిక నిపుణులు పనిచేయనున్నారని, మాస్ ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఇందులో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం హీరోయిన్లలో ఒకరైన శ్రద్ధా శ్రీనాథ్ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. శ్రద్ధా శ్రీనాథ్ ఈ లుక్‌లో అల్ట్రా మోడ్రెన్‌గా అందమైన నవ్వుతో కనిపిస్తున్నది. నరేశ్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘురామ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కాటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: ఎస్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్స్.

యావరేజ్ స్టూడెంట్ రాగాలు

పవన్‌కుమార్ కొత్తూరి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన ప్రచార చిత్రాలకు స్పందన బాగున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఈ సినిమాకు సంబంధించిన పాటను విడుదల చేశారు. 'సారా సారా..' అంటూ సాగే ఈ పాటను శివ కృష్ణచారి ఎర్రోజు రాయగా, కార్తీక్ బి.కొడకండ్ల స్వరపరిచారు. పద్మలత, అనుదీప్‌దేవ్ ఆలపించారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాలో స్నేహ మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ కథానాయికలు.

స్ఫూర్తిదాయక మహిళా పోరాటం

'దృఢ సంకల్పం ఉన్న ఓ మహిళ చేసే స్ఫూర్తిదాయక పోరాటమే 'రఘు తాత' సినిమా..' అని నటి కీర్తి సురేశ్ అంటున్నది. సుమన్ కుమార్ దర్శకత్వంలో ఆమె నటించిన 'రఘు తాత' చిత్రం ఆగస్ట్ 15న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సినిమాపై రాజకీయ వివాదాలు తలెత్తుతున్న నేపథ్యంలో కీర్తి సురేశ్ క్లారిటీ ఇచ్చింది. ఇటీవలే చెన్నయ్‌లో జరిగిన ఈ సినిమా పాటల వేడుకలో ఆమె మాట్లాడుతూ– 'ఇది విభిన్నమైన కథ. ఓ మహిళ ఎదుర్కొనే సవాళ్లే ఈ సినిమా ఇతివృత్తం. ఇందులో మంచి సందేశం ఉంది. గొప్ప వినోదం ఉంది. అందరూ అనుకుంటున్నట్టు ఇందులో రాజకీయ అంశాలేం లేవు. ఇది పూర్తి కామెడీ సినిమా' అంటూ చెప్పుకొచ్చింది కీర్తిసురేశ్. ఇంకా చెబుతూ ఈ సినిమాలోని పాటలు నాకు చాలా ఇష్టం. తప్పకుండా అందరికీ నచ్చుతాయి.' అని తెలిపింది కీర్తి సురేశ్. ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్న తొలి తమిళ సినిమా ఇదే కావడం విశేషం.